ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

పెండింగ్ జీతాలు చెల్లించాలి

● ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి గ్రామ పంచాయతీ కార్మికుల వినతి

పెన్‌పహాడ్, జూన్ 19 : ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి పలువురు గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఐదు నెలలుగా జీతాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలో పని చేస్తున్న ప్రతి కార్మికుడికి నెల నెలా జీతం అందించేలా చూడాలని కోరారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి రూ.5 లక్షల ఇన్సూరెన్స్‌ను అమలు చేయాలన్నారు. కారోబార్ బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. మరణించిన కార్మికుడికి తక్షణ సాయంగా రూ.20 వేలు అందించాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ నర్సిరెడ్డి స్పందిస్తూ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ధనియాకుల శ్రీనివాస్, రణపంగ వెంకన్న, పలువురు కార్మికులు ఉన్నారు.

ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం

● నాగారం మండల సామాజిక తనిఖీలో బహిర్గతం

ప్రజా వేదికలో మాట్లాడుతున్న పీడీ మధుసూదన్‌రాజు

నాగారం, జూన్ 19 : మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల్లో నిధుల దుర్వినియోగం బహిర్గతమైంది. మూడో విడుత సామాజిక తనిఖీలో భాగంగా బుధవారం ఎంపీపీ కూరం మణి వెంకన్న అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఓపెన్ ఫోరం నిర్వహించారు. మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల్లో హరితహారం, పంట కాల్వ పనులు, నర్సరీలు, వివిధ పనుల రికార్డులను 2023 నుంచి 2024 వరకు పీడీ మధుసూదన్‌రావు తనిఖీ చేశారు. దాంతో రూ.2,47,416 అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. పని చేయని వారికి ఫోర్జరీ సంతకాలతో అధిక బిల్లులు రాసినట్లు గుర్తించారు. అలాగే పే స్లిప్పులు కూలీలకు ఇవ్వకుండానే నగదు ఇష్టం వచ్చినట్లు పలు ఖాతాల్లోకి బదిలీ చేసినట్లు గుర్తించారు. సొమ్మును రికవరీ చేయాలని లేని పక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం మండలంలోని సీనియర్ మేట్లు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని, నూతన గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను గుర్తించాలని పీడీకి వినతిపత్రం అందజేశారు. పీడీ సానుకూలంగా స్పందిస్తూ ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ శిరీష, వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, నరేందర్, ఎంపీడీఓ దారా శ్రీనివాస్, ఎస్ఆర్‌పీ సాంబశివ, చారి, ఏపీఎం రవికుమార్, పీఆర్‌పీలు, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణపై అవగాహన

మోతె : జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి నాగరాజు

మోతె, జూన్ 19 : జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంపై ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్స్, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించినట్లు మండల వైద్యాధికారి నాగరాజు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20 నుంచి 27 వరకు జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం కొనసాగనున్నట్లు తెలిపారు. ఒకటి నుంచి రెండేండ్ల పిల్లలకు సగం మాత్ర, 2 నుంచి 3 ఏండ్ల పిల్లలకు పూర్తి మాత్ర పొడి చేసి నీళ్లలో కలిపి తాపించాలన్నారు. 3 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు మాత్ర చప్పరించిన తర్వాత నీరు తాగాలన్నారు. ఆల్బెండజోల్ మాత్ర ఆహారం తీసుకున్న తర్వాతే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బిందూ, సూపర్‌వైజర్ కమలమ్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతనకల్ : జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి ఆశ్రితరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రజలు ఇంటి పరిసరాల్లో మురుగు గుంతలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, చికెన్ గునియా, డెంగీ, ఫైలేరియా వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ఆనందగౌడ్, సీతారాంరెడ్డి, మాణిక్యమ్మ పాల్గొన్నారు.

అర్హులకు ఉచిత విద్యుత్ అందించాలి

● సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు

గరిడేపల్లి, జూన్ 19 : ప్రజా పాలనలో దరఖాస్తులు స్వీకరించిన అధికారులు వాటిని ఆన్‌లైన్‌లో తప్పులుగా నమోదు చేయడంతో అర్హులైన చాలామంది ఉచిత కరెంట్ పొందలేకపోతున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు తెలిపారు. దరఖాస్తులను పునఃపరిశీలన చేసి అర్హులందరికీ అవకాశం కల్పించాలని కోరుతూ బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఇప్పటికైనా అధికారులు చేసిన తప్పులను గుర్తించి మరోసారి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు తీసుకుని న్యాయం చేయాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు కడియాల అప్పయ్య, యడ్ల అంజిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, యోహాన్, వెంకట్‌రెడ్డి, రమేశ్ ఉన్నారు.

రేషన్ కార్డులు అందించాలి

అర్హులకు రేషన్ కార్డులు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అర్హులైన అందిరికీ రేషన్ కార్డులు మంజూరీ చేస్తామని చెప్పిందన్నారు. కానీ లోక్‌సభ ఎన్నికలు రావడంతో కోడ్ కారణంగా ఆ ప్రక్రియను మొదలు పెట్టలేదని చెప్పారని, ఇప్పుడు ఎన్నికల కోడ్ ముగిసినందున ప్రభుత్వం వెంటనే నూతన రేషన్ కార్డులను మంజూరీ చేయాలని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

INDUSIND BANK
COMMERCIAL VEHICLE FOR SALE
1) TATA LPT 4223 CRE BS IV
CAB CHASSIS 2019 MODEL
TS 29 TA 0198
DEAL NO AVK01460D
Cell No.9959445310
D.No.797, 1ST FLOOR
Bharath Reddy Complex, Main Road,
Kodada, Suryapet (Dist.) 508206

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | ఖమ్మం : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777636 | తొలుపునూరి : 9182777638

అధికారులు సమన్వయంతో పని చేయాలి

● ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతి

నడిగూడెం : లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతి

నడిగూడెం, జూన్ 19 : అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం 23 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగేంధర్, ఎంపీపీ యాతాకుల జ్యోతిమధుబాబు, జడ్పీటీసీ బానాల కవితా నాగరాజు, బూత్కూరు వెంకట్‌రెడ్డి, పల్లా నర్సిరెడ్డి, గుండు శ్రీను, కాసాని వెంకటేశ్వర్లు, గడ్డం మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కోదాడ టౌన్ : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 166 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, ఎంపీపీ మల్లెల రాణి, రాష్ట్ర నాయకులు ఎర్నేని బాబు, చుండూరు వెంకటేశ్వర్‌రావు, ప్రశాంతి, బొలిశెట్టి శిరీష, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

తిరుమలగిరి : తిరుమలగిరిలో లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం పేద యువతుల వివాహానికి కల్యాణలక్ష్మి చెక్కులను అందచేస్తుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పలువురి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ఇచ్చిన హామీలు నెరవేర్చి పేదలకు అండగా ఉంటామని అన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ స్నేహలత, మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ, తాసీల్దార్ సుధా పాల్గొన్నారు.

హరితహారం లక్ష్యం 2.60 లక్షల మొక్కలు

● ఆత్మకూర్.ఎస్ మండలంలో నాటేందుకు మొక్కలు సిద్ధం

ఏపూర్ నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

ఆత్మకూర్ ఎస్, జూన్ 19 : రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చేందుకు మాజీ సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విషయం తెలిసిందే. నర్సరీల్లో మొక్కలను పెంచి ప్రతి వానకాలంలో ఖాళీ ప్రదేశాలు, రోడ్లకు ఇరువైపులా వాటిని నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. గతంలో నాటిన మొక్కలు ఇప్పుడు ఏపుగా పెరిగి గ్రామాలకు హరిత శోభను తెచ్చిపెట్టాయి. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. అదే స్ఫూర్తితో హరితహారం కార్యక్రమాన్ని కొనసాగించేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. ఆత్మకూర్ ఎస్ మండలంలో హరితహారంలో భాగంగా ఈసారి 2 లక్షల 60 వేల మొక్కలను నాటడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం తగిన ప్రణాళికలు సిద్ధం చేశారు.

మొక్కలు నాటేందుకు రోడ్డుకు ఇరువైపులా తీసి ఉంచిన గుంతలు

గ్రామాల్లో నర్సరీల ఏర్పాటు..

మండలంలో మొత్తం 30 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతీ పంచాయతీలో నర్సరీ ఏర్పాటు చేశారు. ఒక్కో నర్సరీలో 8 నుంచి 10 వేల మొక్కలు పెంచుతున్నారు. నర్సరీలో మొక్కల పెంపకం బాధ్యతను గ్రా పంచాయతీలకు అప్పగించారు. మొక్కల పెంపకాన్ని పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నర్సరీల్లో ప్రధానంగా కానుగ, నిమ్మ, దానిమ్మ, జామ, సీతాఫలం, పూలు, నీడనిచ్చే పలురకాల మొక్కలను పెంచుతున్నారు. వర్షాలు కురియగానే మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈ నెల చివరి వారం లేదా జూలై మొదటి వారంలో హరితహారం ప్రాంభం అవనున్నట్లు అధికారులు భావిస్తున్నారు.

హరిత లక్ష్యాన్ని చేరుకుంటాం

మండలంలో మొక్కలు నాటే కార్యక్రమంలో అనుకున్న లక్ష్యాన్ని వంద శాతం చేరుకుంటాం. మండలంలో అన్ని గ్రామాల్లో ఉన్న నర్సరీల్లో ఇప్పటికే నాటేందుకు మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.

– ఎండీ. హసీం, ఎంపీడీఓ, ఆత్మకూర్ ఎస్.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

● ఏఓ శ్రీధర్

నారాయణపురంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న ఏఓ శ్రీధర్

చిలుకూరు, జూన్ 19 : రైతులు భూసార పరీక్షల కోసం తమ పొలాల్లో మట్టి నమూనాలను వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి శ్రీధర్ సూచించారు. బుధవారం మండలంలోని నారాయణపురం గ్రామంలో పలువురు రైతుల పొలాల వద్ద నుంచి మట్టి నమూనాలను సేకరించి మాట్లాడారు. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా ఎరువులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా బిక్కుమళ్ల పాఠశాల ఆవరణ

పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు తొలగించడంతో శుభ్రంగా కనిపిస్తున్న పాఠశాల ఆవరణ

నూతనకల్, జూన్ 19 : మండలంలోని బిక్కుమళ్ల పాఠశాల ఆవరణలో పారిశుధ్య లోపం శీర్షికన మంగళవారం నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన వార్తాంశానికి అధికారులు స్పందించారు. బుధవారం గ్రామ పంచాయతీ సిబ్బందితో పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు. దాంతో పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా తయారైంది.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

పాఠ్య పుస్తకాల పంపిణీ

అర్వపల్లి, జూన్ 19 : మండలంలోని ఎంపీయూపీఎస్ కోడూరు పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రమణమ్మ, ఉపాధ్యాయులు అశోక్, సాయిలు, రాము, అంగన్‌వాడీ టీచర్లు సునీత, రమణ, వీఓ సరళ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో హుజూర్‌నగర్‌లో మృతి చెందిన బర్రెలు

విద్యుదాఘాతంతో బర్రెలు మృతి

హుజూర్‌నగర్, జూన్ 19 : విద్యుదాఘాతంతో ఎనిమిది పాడి బర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన హుజూర్‌నగర్ పట్టణంలోని ట్యాంక్‌బండ్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. మంగళవారం కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభం విరిగి తీగ కిందపడడంతో మేత కోసం వెళ్లిన ఎనిమిది బర్రెలు షాక్‌కు గురై అక్కడిక్కడే మృతిచెందినట్లు బాధితులు తెలిపారు. సుమారు రూ.6 లక్షలు నష్టం వాటిల్లినట్లు వాపోయారు.

21న అర్వపల్లి సంత వేలం

అర్వపల్లి, జూన్ 19 : ఈ నెల 20న అర్వపల్లి సంత వేలం నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ సందీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.30 వేలు వేలం పాట ముందు గ్రామ పంచాయతీ కార్యదర్శికి చెల్లించాలన్నారు. అత్యధికంగా పాట దారుడికి సంత అప్పగించడం జరుగుతుందన్నారు. సంత వేలం దక్కించుకున్న పాటదారుడు తై బజార్‌లో షాపునకు రూ.50 చొప్పున వసూలు చేయాలని తెలిపారు. ఈ నెల 21 నుంచి 2025 జూన్ 20 వరకు పాట దారుడికి సంత అప్పగించడం జరుగుతుందన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు అర్వపల్లి విద్యార్థుల ఎంపిక

అర్వపల్లి, జూన్ 19 : నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అర్వపల్లికి చెందిన 9వ తరగతి విద్యార్థులు మహ్మద్ అస్లాంబాషా సిద్ధిఖ్, ఓర్సు ఇందు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఎం.విజయలక్ష్మి తెలిపారు. దీంతో వారికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఉపకార వేతనం లభించనున్నట్లు చెప్పారు.

మట్టపల్లి నృసింహుడి నిత్య కల్యాణం

స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి, జూన్ 19 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నృసింహుడి నిత్య కల్యాణాన్ని అర్చకులు బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేసి పట్టు వస్త్రాలతో అలంకరించి పూజలు చేశారు. కల్యాణ మండపంలో కల్యాణం జరిపించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్, దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

● వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ నాగేశ్వర్‌రావు

వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న అధికారులు

కోదాడ టౌన్, జూన్ 19 : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ నాగేశ్వర్ రావు తెలిపారు. బుధవారం కోదాడ పట్టణంలోని సబ్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకుని పలు అంశాలపై అవగాహన కల్పించారు. మొత్తం 41 ఫిర్యాదులు రాగా అందులో ఎక్కువగా వ్యవసాయ కనెక్షన్ సమస్యలు, విద్యుత్ ప్రమాదాలతో మృతిచెందిన బాధితులకు పరిహారం చెల్లింపు, పెండింగ్‌లో ఉన్న బిల్లుల సమస్యలు, మీటర్ చేంజింగ్ వంటి వాటిపై వచ్చినట్లు తెలిపారు. వినియోగదారులు కార్యాలయాల చుట్టూ తిరుగనవసరం లేకుండానే సమస్యల ఫిర్యాదుల కోసం సీజీఆర్ఎఫ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే కన్స్యూమర్ గ్రీవెన్స్ సెల్ సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ డీఈ వెంకట కృష్ణయ్య, ఏడీ ఈ వెంకన్న, ఏఈలు మల్లెల శ్రీనివాస్, వినోద్, కీర్తిరెడ్డి, వెంకట్, శోభారాణి, లైన్‌మెన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల పెన్షన్ పెంచకుంటే సీఎం ఇల్లు ముట్టడి

● దివ్యాంగుల హక్కుల పోరాట సమితి కోర్ కమిటీ చైర్మన్ రాంబాబు

సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ కోర్ కమిటీ చైర్మన్ రాంబాబు

బొడ్రాయిబజార్, జూన్ 19 : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పెన్షన్ పెంపుపై ప్రకటన చేయకుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇల్లు ముట్టడిస్తామని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి కోర్ కమిటీ చైర్మన్ అందే రాంబాబు అన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో బాబు జగ్జీవన్‌రాం భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు చింత సతీశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు 4 వేల నుంచి 6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, బీడీ కార్మికులకు 2 వేల నుంచి 4 వేల వరకు పెన్షన్ పెంచుతామని చెప్పి ఆరు నెలలు గడుస్తున్నా నేటికి సీఎం మాట్లాడకపోవడం విడ్డూరమన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించారో అలాగే దివ్యాంగులకు కూడా ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే అన్ని ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమం కోసం అంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వీహెచ్‌పీఎస్ గ్రామ, మండల, జిల్లా కమిటీలను పునర్‌నిర్మాణం చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు కర్ల విజయరావు, పెరెల్లి బాబు, చిట్టి రాజు, పంతం నాగయ్య, బండి మల్లయ్య, మల్కలపల్లి సైదులు, చింత సాంబయ్య, మిద్దె సైదులు, సోమపంగు శ్రీకాంత్ పాల్గొన్నారు.

23 నుంచి అఖిలాంధ్ర సాధు పరిషత్ మహాసభలు

● ఈగా దయాకర్‌కు ఆహ్వానం

ఈగా దయాకర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న శ్రీనివాస్‌శర్మ

బొడ్రాయిబజార్, జూన్ 19 : ఈ నెల 23 నుంచి 25 వరకు శ్రీరామ జన్మభూమి అయోధ్యలో అఖిలాంధ్ర సాధు పరిషత్ మహాసభలు జరుగనున్నాయి. మహా సభల్లో పాల్గొనాల్సిందిగా కోరుతూ సూర్యాపేటకు చెందిన సదాచార్ ట్రస్ట్ కన్వీనర్ ఈగా దయాకర్ గుప్తాకు భాగ్యనగర్ అయోధ్య శ్రీరామ సేవా ఫౌండేషన్ నిర్వాహకుడు చల్లా శ్రీనివాస్‌శర్మ బుధవారం హైదరాబాద్‌లోని సంఘ కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. సభలకు ముఖ్య అతిథిగా ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యానాథ్ హాజరు కానున్నట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అఖిల్‌కుమార్

శ్రీచైతన్య స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అఖిల్‌కుమార్

నేరేడుచర్ల, జూన్ 19 : నేరేడుచర్ల పట్టణంలో అనుమతులు లేకుండా నడిపిస్తున్న శ్రీ చైతన్య స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏర్ర అఖిల్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన సంఘం పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీచైతన్య స్కూల్ యజమాన్యం అనుమతులు లేకుండా కొత్త బ్రాంచ్‌లను ప్రారంభిస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నట్లు తెలిపారు. అనుమతులు లేని పాఠశాలలపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు విజయ్‌రెడ్డి, మహేశ్, భార్గవ్, సాయి, యూసుఫ్, నరేశ్, రాము పాల్గొన్నారు.

రామన్నకు నివాళి

బొడ్రాయిబజార్, జూన్ 19 : ప్రజల కోసం త్యాగాలు చేసిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి నల్లగొండ జిల్లా కమిటీ సభ్యుడు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి బాదె రామన్న చిర స్మరణీయుడని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ అన్నారు. రామన్న 5వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇప్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్ పాల్గొన్నారు.